## క్లుప్తంగా

### చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి


బండి సాగర్ (ఫైల్)

కమలాపూర్ : మండలంలోని శనిగరం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బండి సాగర్ (31) ఆదివారం చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో పడి మృతి చెందినట్లు పోలీసులు సోమవారం తెలిపారు. చెక్‌డ్యాంలో దిగి చేపలు పడుతున్న క్రమంలో సాగర్ ప్రమాదవశాత్తు నీట మునిగి ఊపిరాడక మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. సాగర్ తండ్రి సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వి.కుమారస్వామి తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 9న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, సుబేదారి పోలీసు స్టేషన్‌రోడ్డు, సుబేదారి రామాలయం ప్రాంతాల్లో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

### నేడు వాహనాల వేలం

కాజీపేట అర్బన్: వివిధ కేసుల్లో పట్టుబడిన బొలెరో, ద్విచక్ర వాహనాలకు హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం వేలం పాట నిర్వహించనున్నట్లు హనుమకొండ ఎక్సైజ్ సీఐ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 50శాతం దరావత్తు సొమ్మును చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 87126 59019 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

### ప్రశ్నించే వారినే బలపరచండి



నయీంనగర్: రాష్ట్రంలో రానున్న ఖమ్మం – వరంగల్ – నల్గొండ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను పోటీ చేస్తున్నానని, ప్రశ్నించే గొంతుకనే బలపరచాలని ఏఐసీసీ మాజీ సభ్యుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బక్క జడ్సన్ కోరారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలను మోసంచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బొందపెట్టారని విమర్శించారు. సమావేశంలో ఎండీ.అంకుష్, చాగంటి అనిల్, తుల రవి తదితరులు పాల్గొన్నారు.

### రన్నరప్‌గా జేఎన్ఎస్ వాలీబాల్ జట్టు

వరంగల్ స్పోర్ట్స్: కేఆర్ఎన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టు ఆల్ వాలీబాల్ పోటీల్లో జేఎన్ స్టేడియం జట్టు రన్నరప్‌గా నిలిచి ట్రోఫీని కైవసం చేసుకుంది. మేడారం సమ్మక్క సారలమ్మ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో జేఎన్ఎస్ జట్టు ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. రన్నరప్ జట్టు సభ్యులతో పాటు డీఎస్ఏ కోచ్ జీవన్‌గౌడ్‌ను హనుమకొండలోని తన చాంబర్‌లో డీవైఎస్ఓ అశోక్ సోమవారం అభినందించారు.

### ఆట వస్తువుల పంపిణీ



హన్మకొండ చౌరస్తా: లష్కర్‌బజార్‌లోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పిల్లలకు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి ఆట వస్తువులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు ఆటలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ, జగన్మోహన్, హాస్టల్ ఇన్‌చార్జ్ దీప, శ్రీనివాస్, ప్రసన్నకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

### మెరిట్ స్కాలర్‌షిప్‌ల అందజేత



దేశాయిపేట: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఉల్లాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మెరిట్ స్కాలర్‌షిప్‌లను సోమవారం పంపిణీ చేశారు. 9, 10వ తరగతుల్లో సాధించిన మార్కుల ఆధారంగా ప్రతి పాఠశాలలో 10మంది విద్యార్థులకు అందించారు.

# కామన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి
- నూతన సంవత్సర క్యాలెండర్ల ఆవిష్కరణ


కమలాపూర్ : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ


ఎల్కతుర్తి : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : నాణ్యమైన విద్య అందాలంటే ప్రభుత్వం వెంటనే కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని టీపీటీఎఫ్ (తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వానికి సూచించారు. సోమవారం భీమదేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట 2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోర్టు కేసుల వలన ఆగిపోయిన టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోరారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల జీవిత భద్రతకు పెనుముప్పుగా మారిన కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. అనంతరం జిల్లా కార్యదర్శి చందుపట్ల రాజేంద్రం మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేందుకు స్కావేంజర్లను నియమించాలని కోరారు. పాఠశాలల్లో కొనసాగుతున్న తొలిమెట్టు ఉన్నతి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి పాఠశాలల్లో ఉపాధ్యాయులు తరగతి గదిలో బోధించే విధంగా స్వేచ్ఛను కల్పించాలని కోరారు. మండల అధ్యక్షుడు కాలేసి కొమురయ్య, ప్రధాన కార్యదర్శి ఏనుగు శంకర్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, స్టాలిన్, విజయభాస్కర్, ముంతాజ్ అలీ, శ్రీరామచంద్రమూర్తి, సౌందర్య, ఉమ, ఉషారాణి, మహేందర్, రాజన్‌నాయక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

**పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ**

కమలాపూర్ : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో పీఆర్టీయూ–టీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ రాంకిషన్‌రాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు పటేల్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శీలం ప్రకాశ్‌బాబు, నాయకులు నిర్మల, తిరుపతిరెడ్డి, సదాశివరెడ్డి, దయాకర్‌రెడ్డి, విజయ, ఉపాధ్యాయులు అన్నమ్మ, స్వరూపరాణి, ఉమాదేవి, నాగమణి, కల్పన, నర్సింహస్వామి, సురేష్, శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది సుభాష్, శ్రీనివాస్, స్రవంతి పాల్గొన్నారు.

**ఆరె సంఘం ఆధ్వర్యంలో..**


శాయంపేట : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

శాయంపేట : మండలంలోని ఆరెపల్లిలో సోమవారం ఆరె సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు దుర్నాల రాజు ఆ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హింగే శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి వజ్ర కిషన్‌రావు, కులసంఘం పెద్దలు మనోహర్, శివ, మండల గౌరవ అధ్యక్షుడు పాపారావు, మండల ఉపాధ్యక్షుడు మహేందర్, బాపురావు, శ్రీనివాస్, సంజీవరావు, రాజేశ్వర్‌రావు, వినయ్, రవీందర్, కిషన్‌రావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.

# ఒడితల ప్రణవ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

కమలాపూర్ : దివంగత మాజీ రాజ్యసభ సభ్యుడు ఒడితల (సింగపూర్) రాజేశ్వర్‌రావు మనవడు, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్‌బాబుకు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని భారత మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావు సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ పలువురికి అండగా నిలుస్తున్న ప్రణవ్‌బాబుకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. వారి కుటుంబం నీతి, నిజాయితీకి మారుపేరుగా ప్రసిద్ధికెక్కిందన్నారు. తొలి తెలుగు ప్రధానిగా పీవీ నరసింహారావు, రాజ్యసభ సభ్యుడిగా ఒడితల రాజేశ్వర్‌రావు దేశానికి ఎనలేని సేవలందించారన్నారు. అంతటి గొప్ప కుటుంబానికి చెందిన ప్రణవ్‌బాబుకు సముచిత స్థానం కల్పిస్తూ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నట్లు తెలిపారు.

### డేటా ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలి


వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీపీ

శాయంపేట : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమంలో లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి త్వరగా పూర్తి చేయాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న ఆన్‌లైన్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ నెల 12వ తేదీ లోపు డాటా ఎంట్రీ పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిశెట్టి లతాలక్ష్మారెడ్డి, ఉపసర్పంచ్ దైనంపల్లి సుమన్, ఎంపీటీసీ ఉమారఘుసింగ్ పాల్గొన్నారు.

# కూతురే పెద్ద కుమారుడై..

- తండ్రి చితికి తలకొరివి పెట్టిన కూతురు


వీరస్వామి చితికి నిప్పు పెడుతున్న కూతురు

శాయంపేట : మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ టీచర్, లయన్స్ క్లబ్ సభ్యుడు కోమటి వీరస్వామి (82) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. అయితే అతనికి కుమారులు లేకపోవడంతో కూతురు సృజన పెద్ద కుమారుడి పాత్ర పోషించి వీరస్వామి చితికి నిప్పు పెట్టి దహన సంస్కారాలు పూర్తి చేసింది. కాగా కోమటి వీరస్వామి మృతి చెందిన విషయం తెలుసుకున్న పలువురు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ జయపాల్‌రెడ్డి, డాక్టర్ కాశయ్య, సర్పంచ్ రవి, ఉపసర్పంచ్ సుమన్, లియాఫీ జేపీసీ పరకాల శాఖ అధ్యక్షుడు బాబు, నాయకులు రవీందర్, రాజేశంగౌడ్, రాజేశ్వర్‌రావు, విజయ్‌భాస్కర్, కుమారస్వామి, లింగారావు, వీరస్వామి, తిలక్‌బాబు, రిటైర్డ్ టీచర్లు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ


ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

శాయంపేట : విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని మేఘన డీఈఓగా వ్యవహరించగా.. ప్రధానోపాధ్యాయుడిగా వరిష్ణ, పీఈటీగా హారిక వ్యవహరించారు. వారితో పాటు 18 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు హెచ్ఎం శ్రీలత బహుమతులను అందించారు.


# దీపోత్సవం, మంగళ హారతి సమర్పణ


నక్షత్రహారతి సమర్పిస్తున్న రవి


మంగళ హారతులు సమర్పిస్తున్న భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి స్వయంభూ శ్రీలక్ష్మినృసింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు 24వ రోజుకు చేరుకున్నాయి. కాగా సోమవారం ఆలయంలో భక్తులు మట్టి ప్రమిదలలో నేతి దీపాలు వెలిగించి మంగళం పాడారు. అదే విధంగా మహిళా భక్తులు మంగళ హారతులు సమర్పించారు. అర్చకులు నక్షత్రహారతి సమర్పణతో కార్యక్రమం ముగిసింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద గోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా రవి ఆచార్యులు మాట్లాడుతూ.. తిరప్పావైలోని 24వ పాశురంలో గోదా అమ్మవారు శ్రీమన్నారాయణుడికి మంగళం పలికిందన్నారు. భక్తుల సమక్షంలో పాశురాన్ని పాడి వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అర్చకుడు జయకృష్ణ ఆచార్యులు, మహిళ భక్తులు రాణి, మమత, శారదాదేవి, అహల్య, సుభద్ర, అనసూయ, విమల, లావణ్య, రమ, గౌతమి, సుజాత, రేణుక పాల్గొన్నారు.

### ఎస్సైగా గైకడి అనిల్‌కుమార్


అనిల్ కుమార్

ఐనవోలు : ఎస్సైగా గైకడి అనిల్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేసిన వంగాల నవీన్‌కుమార్ గంజాయి కేసులో ఎన్‌డీపీఎస్ గైడ్‌లైన్స్ అనుసరించి దర్యాప్తు చేపట్టకుండా విధుల్లో అలసత్వం వహించగా సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. కాగా ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న గైకడి అనిల్‌కుమార్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఐనవోలు ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు. ఏఎస్సై, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్‌కు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అయోధ్య రాముడి అక్షింతల వితరణ


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

శాయంపేట : అయోధ్య రాముడి అక్షింతలను రామమందిరం ట్రస్టు ద్వారా 500మంది వేద పండితులతో పూజించిన అక్షింతలను సోమవారం పత్తిపాక గ్రామంలో శ్రీ రామాంజనేయ భజన మండలి భక్తులు అక్షింతలను పంపిణీ చేశారు. గ్రామంలోని శ్రీ సంజీవ ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు రాజు అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి భక్తి గీతాలు ఆలపిస్తూ పురవీధుల గుండా శోభాయాత్ర చేపట్టారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో భజన మండలి సభ్యులు మాందాడి రాజు, తడక సదానందం, కూనూరు రాజు, శ్రీధర్, రవి, రమేష్, మహేందర్, ప్రభాకర్‌రెడ్డి, సాంబరెడ్డి, మల్లయ్య, రాంరెడ్డి, కుమారస్వామి, శంకర్‌తో పాటు పాల్గొన్నారు.

### మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీకి సన్మానం

ఖిలా వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా నేషనల్ మెడికల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఎన్నికైన ఫోర్ట్‌రోడ్డుకు చెందిన డాక్టర్ మైదం రాజును డాక్టర్ పులి అనిల్‌కుమార్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

# తహసీల్దార్ ఎదుట 8 మంది బైండోవర్


బైండోవర్ చేస్తున్న తహసీల్దార్ విక్రమ్ కుమార్

ఐనవోలు : ప్రఖ్యాత శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో సంక్రాంతి నుంచి ఉగాది వరకు జాతర బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ చట్టాన్ని ఎవరు అతిక్రమించకుండా ఆ శాఖ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఐనవోలు, నాగపురం, పున్నేలు గ్రామాలకు చెందిన 8 మంది అనుమానాస్పద వ్యక్తులను సోమవారం తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై సరిత తెలిపారు. బైండోవర్ అయిన వారిలో నాగపురంకు చెందిన బుర్ర సతీష్, తోట రాజేష్, పున్నేలుకు చెందిన మూర కుమారస్వామి, ఐనవోలుకు చెందిన బొల్లెపల్లి శ్రీధర్, రమేష్, రాజశేఖర్, సుభద్ర, గడ్డం ఎల్లాగౌడ్ ఉన్నారు. ఎక్సైజ్ చట్టానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ హెచ్చరించారు. హెచ్‌సీ ఏ రాజు తదితరులు ఉన్నారు.

### కరోనా జేఎన్1పై అవగాహన

నడికూడ : మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారం కరోనా జేఎన్1పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ.. కోవిడ్ మహమ్మారి సమయంలో తీసుకున్న జాగ్రత్తలు మరోసారి పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



కాజీపేట అర్బన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం సూచించారు. కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలో సోమవారం పలు మొక్కలను నాటి ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ప్రశాంత వాతావరణాన్ని అందించేందుకు పాఠశాల ఆవరణలో విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రతినెలా ఒక పాఠశాలను ఎంపిక చేసి మొక్కలు నాటుతున్నట్లు వివరించారు. జిల్లా రెవెన్యూ అధికారి గణేష్, శ్రవణ్‌కుమార్, రాజయ్య, పాఠశాల హెచ్ఎం మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఫ్రీజర్స్ నిల్వతో దుర్వాసన


కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాలనీవాసులు

పరకాల : గత కొంతకాలంగా ఇళ్ల మధ్య నిల్వ చేస్తున్న డెడ్‌బాడీ ఫ్రీజర్స్‌తో దుర్వాసన వస్తుందని 13వ వార్డులోని టీచర్స్ కాలనీ వాసులు తెలిపారు. ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్‌స్వామికి ఫిర్యాదు చేశారు. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పరకాల మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. లయన్స్‌క్లబ్ స్వర్గరథం నడుపుతున్న ఓ మహిళ డెడ్‌బాడీ ఫ్రీజర్స్‌ను తీసుకొచ్చి టీచర్స్ కాలనీలోని ఓ ఇంటిలో నిల్వ చేస్తున్నట్లు తెలిపారు. వాటిని శుభ్రం చేయకుండా చనిపోయిన వారి రక్తంతో తీసుకొచ్చి నిల్వ చేయడం వలన దుర్వాసన వస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాలనీవాసులు వ్యాధుల బారిన పడకుండా తక్షణమే డెడ్‌బాడీ ఫ్రీజర్స్‌ను కాలనీ మధ్య నిల్వ చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకెల్లీ కుమారస్వామి, మడికొండ రవీందర్, మడికొండ జయరాజ్, బొచ్చు అశోక్, ఒంటేరు ప్రభాకర్, మడికొండ చెంగల్‌రావు, బొమ్మకంటి చంద్రమౌళి, బొచ్చు సదానందం, బొచ్చు రవి, ఒంటేరు మంజుల, లక్ష్మణ్, జీవన్ రాజయ్య, మడికొండ సుధాకర్ భాస్కర్ పాల్గొన్నారు.

# నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి


భిక్షపతిని సన్మానిస్తున్న కాలనీవాసులు

దామెర : నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన భూపోరాట సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదన్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లుకట్టి ఇస్తామని చెప్పడం హర్షించాల్సిన విషయమని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న 40 శాతం మంది కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం, ఉపాధి అందకుండా జీవనం కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యులు కొట్టెపాక రవి, మండల కార్యదర్శి సాంబయ్య, సహాయ కార్యదర్శులు దండు భాస్కర్, ఎడ్ల మంజుల, కోశాధికారి గొలుసుల దేవేందర్, శివ, కాలనీవాసులు పాల్గొన్నారు. అనంతరం కాలనీవాసులు ఆయను శాలువాతో ఘనంగా సన్మానించారు.

# ఎంఎస్‌పీని ఊరూరా బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న బండారి సురేందర్ మాదిగ

కమలాపూర్ : మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ)ని గ్రామగ్రామాన బలోపేతం చేయాలని జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ పిలుపునిచ్చారు. ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు చిలువేరు సంపత్ మాదిగ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంఎస్‌పీ మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు చేసి రాజ్యాధికారం దిశగా పయనించాలన్నారు. అనంతరం ఎంఎస్‌పీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నద్దునూరి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఇసంపెల్లి స్వామి, అంకిల్ల రాజమల్లు, ప్రధాన కార్యదర్శులుగా వేల్పుగొండ భద్రయ్య, శనిగరపు సుధాకర్, సహాయ కార్యదర్శులుగా అంబటి భూమయ్య, పున్నం, పుల్ల రమేష్, కార్యవర్గ సభ్యులుగా మంద అనిల్, నద్దునూరి ప్రశాంత్, బొచ్చు వంశీ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి నద్దునూరి కిరణ్, జిల్లా నాయకుడు రవీందర్ పాల్గొన్నారు.

# ‘గృహలక్ష్మి’ లబ్ధిదారులకు అన్యాయం చేయొద్దు


వినతిపత్రం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

పరకాల : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీల స్కీంలో గృహలక్ష్మి లబ్ధిదారులను అర్హులుగా చేర్చి తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కోరారు. ఈ మేరకు జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధికాగుప్తాకు వినతిపత్రం అందించారు. గత ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిన గృహలక్ష్మీ పథకానికి పరకాల నియోజకవర్గంలోని పరకాల, నడికూడ, దామెర, ఆత్మకూరు మండలాల పరిధిలో 1,605 మంది లబ్ధిదారులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి ఎంపిక చేసి వారికి ప్రొసీడింగ్‌లు అందించారని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం గృహలక్ష్మి రద్దు నిర్ణయంతో వారికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వయంగా జిల్లా కలెక్టర్ నుంచి మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషంతో ఇళ్ల నిర్మాణ పనులను లక్షలాది రుపాయాల అప్పులు చేసి ప్రారంభించారని, ఎన్నికల కోడ్ రావడం వలన బిల్లుల మంజూరులో జాప్యం జరిగిందన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రద్దు చేయడం అన్యాయం అన్నారు. పరకాల మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌పాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నడికూడ ఎంపీపీ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, దామెర వైస్ ఎంపీపీ జాకీర్‌అలీ, బీఆర్ఎస్ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులను దూషిస్తే కఠిన చర్యలు

- సీడీపీఓ భాగ్యలక్ష్మి


మాట్లాడుతున్న పరకాల సీడీపీఓ భాగ్యలక్ష్మి

పరకాల : తల్లిదండ్రులను దూషిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీడీపీఓ భాగ్యలక్ష్మి అన్నారు. తల్లిదండ్రులను ఆదరించినప్పుడే సమాజంలో గౌరవం దక్కుతుందని అన్నారు. పరకాల వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వయోవృద్ధుల సంక్షేమం కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటిని వినియోగించుకోవాలని కోరారు. సంఘం అధ్యక్షుడు రేపాల నర్సింహరాములు మాట్లాడుతూ.. సమాజంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నామని, వాటిని అధిగమించి సుఖాంతమైన జీవనం గడపాలంటే చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఎడ్ల సుధాకర్, గుర్రం సదానందం, పొరండ్ల కైలాసం, అలీ మున్సీసా, కోడెపాక సమ్మయ్య, బాణాల మొగిలి, జంగేటి సారంగపాణి, మహేందర్‌రెడ్డి , సుంకరి రామన్న తదితరులు పాల్గొన్నారు.

### క్రమశిక్షణతో చదువుకుంటేనే మంచి భవిష్యత్

ధర్మసాగర్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుందని సీఐ రాజు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధర్మప్రకాశ్ అధ్యక్షతన హసన్‌పర్తి సీఐ రాజు సోమవారం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సరైన పద్ధతిని అనుసరించడమే క్రమశిక్షణ అని, పాఠశాల దశ నుంచే అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తరగతి గదిలో ప్రశ్నించే తత్వాన్ని కలిగి ఉండాలని, ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలను అర్థం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, పద్మజ, రాజమ్మ, ప్రసన్న, సునీత పాల్గొన్నారు.